జగనన్నకు చెపుదాం (స్పందన) కు 110 వినతులు

–లాగిన్ లో వెంటనే చూడాలి – కలెక్టర్ సూర్యకుమారి

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లా కలెక్టర్ సూర్యకుమారి ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెపుదాం (స్పందన) కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 110 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 82 ఉన్నాయి. హౌసింగ్ కు 07, మున్సిపల్ శాఖ కు 02, మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి. పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై మిగిలిన వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి, జె.సి మయూర్ అశోక్, డి.ఆర్.ఓ గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మావతి, సూర్యనారాయణ, దొర పాల్గొని ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ. స్పందనలో అందిన వినతులు పెండింగ్ పెట్టకుండా గడువు లోగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు.

పెండింగ్ కేసులు దర్యాప్తు వేగవంతం చేయాలి

డిఐజి బాలకృష్ణ

విశాలాంధ్ర-నెల్లిమర్ల: పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎస్ బాలకృష్ణ అన్నారు. వార్షి తనిఖీల్లో భాగంగా నెల్లిమర్ల పోలీసుస్టేషన్ ను డిఐజి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, సిడి ఫైల్స్ ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విజయనగరం ఇన్చార్జి డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, భోగాపురం సిఐ విజయనాథ్, ఎస్ఐ పి నారాయణ రావు పాల్గొన్నారు.

ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలి

ఆమెటి గ్రామ రైతుల ధర్నా

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో ఆమెటి గ్రామ రైతులు సోమవారం తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామంలో 450 టన్నుల ధాన్యం ప్రభుత్వం ఇంకా కొనుగోలు చేయలేదని, బస్తాలతో కళ్ళల్లోనే నిలువచేసి ఉన్నా మని అయినప్పటికీ ఇంతవరకు కొనుగోలు చేయలేదని సర్పంచ్ ప్రతినిధి కరణం లావణ్యకుమార్, ఉప సర్పంచ్ కరణం రమేష్, ఎంపీటీసీ ప్రతినిధి ఆధ్వర్యంలో రైతులతో ధర్నా నిర్వహించారు. అనంతరం తాసిల్దార్ దోల రాజేశ్వరరావుకు రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ మాట్లాడుతూ ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

సీతమ్ లో మెషీన్ లెర్నింగ్ ప్రత్యేక శిక్షణ

విశాలాంధ్ర -విజయనగరంటౌన్: సీతమ్ మెకానికల్ విద్యార్థుల కు మెషీన్ లెర్నింగ్ అంశాలపై ప్రత్యేక శిక్షణా శిబిరం ప్రారంభించడమైనది. ఈ సందర్భంగా ప్రారంభ సభలో ప్రసంగిస్తూమెకానికల్ ఇంజనీరింగ్‌లో పలు స్థాయిల్లో కృత్రిమ మేధ, కంప్యూటరీకరణ వంటి అంశా లపై గట్టి అవగాహన కలిగి ఉండడం ద్వారా ఉద్యోగా వకాశాలు హెచ్చుగా కలుగుతాయని డేటా ప్రో సొల్యూ షన్స్ ట్రైనర్ తరుణ్ వివరించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు డిజైన్ లోనూ, డేటా విశ్లేషణ లోనూ కొత్త పోకడలను ఆకళింపు చేసుకోవాలని సీతమ్ కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణ రావు పిలుపునిచ్చారు. ఈ సభలో కళాశాల ప్రిన్సిపాల్ డా డివి రామమూర్తి, విభాగాధ్యక్షులు చలపాక వెంకట లక్ష్మి, మెకానికల్ ఆచార్యులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదానికి గురైన జీడీతోట

విశాలాంధ్ర -చీపురుపల్లి: మండలం సంకుపాలెం గ్రామం లో సోమవారం మధ్యాహ్నం విద్యుత్ తీగల వద్ద మంటలు చెలరేగడం వల్ల అగ్ని ప్రమాదానికి గురై ఐదు ఎకరాల జీడీ తోట దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రైతు రెల్లి మురళీ జీడి తోటకు సంబంధించి సుమారు రూ.50వేలు వరకు నష్టం వట్టిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలియపరిచారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

విశాలాంధ్ర -గజపతి నగరం: మండలంలోని దావల పేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను సోమవారం ఎంపీడీవో కొవ్వాడ కిషోర్ కుమార్ మరియు ఏపీవో సిహెచ్ రామారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కల్పిస్తున్న గిట్టుబాటు ధర లభించేలా పనులుచేయాలని కోరారు. అనంతరం వేతనదారుల మస్టార్లను పరిశీలించారు.

కరాటే విజేతలను అభినందించిన కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : కరాటే విజేతలను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అభినందించారు. విశాఖ లో జరిగిన ఆరవ అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్ లో విజేతలుగా నిలిచిన – ఆరు సంవత్సరాల విభాగంలో బి. తమన్ రాజ్ (రజతం), 9 సంవత్సరాల లోపు విభాగంలో ఎం.కార్తికేయ(రజతం), 7 సంవత్సరాల లోపు విభాగంలో కె. ఆకాశ్ (కాంస్యం), 8 ఏళ్ల లోపు విభాగంలో ఎం. యువరాజ్ (కాంస్యం)-సోమవారం కలెక్టర్ కార్యాలయం లో కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి లేక, నూతన పరిశ్రమలు లేక వలసలు

ఇదేం ఖర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

విశాలాంధ్ర-శృంగవరపుకోట : నూతన పరిశ్రమలు రాక.. అభివృద్ధి జాడ లేక రాష్ట్రం నుండి ప్రజలు, నిరుద్యోగ యువత వలసలుపోతున్నారని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆరోపించారు. ఎస్.కోట పట్టణంలోని 3, 4, 5 వార్డుల్లో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పులమయంగా దేశంలోనే మొదటివరసలో వుండేలా చేసినా సీఎం జగన్ రెడ్డి చేతకానితనం వల్లే రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు తెచ్చుకుంటారన్నారు. ప్రజలకు పనులు లేకపోవడంవల్ల రాష్ట్రాన్ని విడిచి ఇతర రాష్ట్రాలకు వలస కూలీలుగా తరలిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే మనమందరం కూడా మరల తెలుగుదేశం పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేసి చంద్రబాబు నాయుదుని సీఎం చేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పరిశ్రమలు, అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని, మన రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు ఒక్కరే అని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, ఎస్.కోట గ్రామ కమిటీ అధ్యక్షులు కొనదం మల్లేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ గన్ను బంగారమ్మ, 4వ వార్డు మెంబెర్ పెదగాడ లక్ష్మి, 5వ వార్డు మెంబెర్ గూడుపు నాగమణి, విశాఖ టీడీపీ పార్లమెంట్ కార్యానిర్వాహక కార్యదర్శి కాపుగంటి శ్రీనివాసు, రాష్ట్ర బిటీడీపీ కార్యదర్శి చెక్కా కిరణ్‌కుమార్, నియోజకవర్గ బిటీడీపీ కార్యదర్శి అనకాపల్లి చెల్లయ్య, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన అధ్యక్షులు వాకాడ బాలు, నియోజకవర్గ తెలుగుయువత అధికార ప్రతినిధి సవరాల తాతారావు, టీడీపీ సీనియర్ నాయకులు పొట్నూరు అప్పలరాజు (సాయిరాం), మోపాద చిన్ని కృష్ణ, తిమిడి గ్రామ వైస్ ప్రెసిడెంట్ బర్ల స్వామి నాయుడు, పెదగాడ రాజు యువత, మహిళలు పాల్గొన్నారు.

పరమశివుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి

నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: లయకారుడు, నిర్వికారుడు పరమశివుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అభిలాషించారు. ఈనెల 18వ తేదీ మహాశివరాత్రి పురస్కరించుకొని ప్రజాపిత బ్రహ్మకుమారి విజయనగరం శాఖ ఆధ్వర్యంలో టౌన్ సెంటర్ లేఅవుట్లో సంస్థ కార్యాలయంలో జరిగిన మహాశివరాత్రి ప్రారంభోత్సవ వేడుకలలో ఆమె పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి శివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాపిత బ్రహ్మకుమారి సంస్థ మన సనాతన సంప్రదాయాలను కాపాడుతూ, భావితరాలకు తెలియచెప్పే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. శివరాత్రి ఉత్సవాలే కాకుండా, కృష్ణాష్టమి వేడుకలను కూడా చాలా సంవత్సరాలుగా నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. అజ్ఞానమనే చీకటి నుంచి ప్రతి ఒక్కరికి పరమశివుడు జ్ఞాన జ్యోతిని ప్రసాదించాలని అన్నారు. నిర్వికారుడు పరమ శివుడు సర్వాంతర యామి అని అన్నారు. లోకాలన్నింటిని శాసించగల ఆదిభిక్షువు అని అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారి నిర్వాహకులు బి కే అన్నపూర్ణ మాట్లాడుతూ శివరాత్రి ప్రాశస్త్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ శ్రీమతి కనకాల సుజాత తో పాటు సంస్థ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

సీతమ్ లో ఐఐటి ప్రొఫెసర్ ల ఉపన్యాస పరంపర

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: గత నాలుగు రోజులుగా సీతమ్ కళాశాలలో జరుగుతున్న ఐఐటి ప్రొఫెసర్ల ఉపన్యాసపరంపరలో భాగంగా సోమవారం దా రంజన్ కుమార్ బెహరా, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్, ఐఐటి పాట్నా, ప్రసంగిస్తూ "నైతికత, మానవీయత, సంతృప్తి, ఆనందము వంటి విషయాలు ఒక దానితో ఒకటి ముడి పడి ఉన్న విషయాల" నీ జీవితం పై సమగ్ర అవగాహన కలిగిన విద్యార్థులు జీవితంలోని ఒడిదుడుకులను ఎదుర్కొని ఆనందమయ జీవితం గడప గలుగుతారని అన్నారు. ఆనందం మన అణువణువులో నిండి ఉంటుందని దాన్ని మనం సుళువైన సాధన ద్వారా పుణికి పుచ్చుకోవచ్చనీ కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణ రావుగ పేర్కొన్నారు. ఈ సభలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి వి రామమూర్తి , వైస్ ప్రిన్సిపల్ డా.టి.డి.వి.ఎ.నాయుడు , డీన్ రిసెర్చి దా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామంనుంచి పాఠశాలను తరలించొద్దు

కలెక్టర్‌కు భీమసింగి వాసుల వినతి

విశాలాంధ్ర-జామి: ఏళ్ళ తరబండి తమ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను నూతన గదులు పేరుతో వేరే గ్రామంలోకి తరలించవద్దని భీమసింగి గ్రామానికి చెందిన ఎంపిటిసి దనియాల హైమావతి ఆధ్వర్యలంలో పలువురు గ్రామ పెద్దలు జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో తమ ఆవేదన వ్యక్తం చేసారు. గ్రామంలో ప్రస్తుతం యుపి పాఠశాల కొనసాగుతోందని, స్కూల్‌కు ఆనుకుని గ్రామ కంఠం ఖాళీ స్థలాలు కూడా ఉన్నాయని అన్నారు. కానీ నూతన భవనాలు నిర్మాణం పేరుతో దాదాపు గ్రామానికి 2.5 కిలోమీటర్లు దూరంలో, కొండల్లో ఉన్న చిల్లపాలెం మెట్టపై ఏర్పాటు చేయడం తగదన్నారు. ప్రస్తుతం ఉన్న పాఠశాలకు సమీపగ్రామాలనూ తెలగాపాలెం, సోమయాజులపాలెం, పీతలపాలెం, వెంకటరాజుపాలెంతో పాటు కొత్తభీమసింగి అన్నంరాజుపేట గ్రామాలకు చెందిన విద్యార్థులు వస్తున్నారని, చిల్లపాలెంలో పాఠశాల ఏర్పాటు చేస్తే జాతీయ రహదారి ట్రాఫిక్‌నుంచి విద్యార్థులు నడిచి వెళ్ళడం నిత్యం ప్రమాదకరమన్నారు. అలాగే అంతదూరం నడిచివెళ్ళడం కష్టమని విద్యార్థులు ప్రవేటు పాఠశాలలను ఆశ్రయిస్తారన్నారు. వెంటనే అదనపు గదులను పాఠశాల పక్కనే కట్టాలని కోరారు. కలెక్టర్‌ను కలిసి వారిలో గ్రామ పెద్దలు దనియాల పైడిరాజు, గులమజ్జి వెంకటరామణ, మజ్జి మోహన్,మజ్జి అప్పలరాజు, ఎ.సూర్యనారాయణ,బి. కృష్ణ,గౌరీ శంకరరావు తదితరులు ఉన్నారు.

కోనేటిలో దిగి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్: పట్టణ శివారు ప్రాంతమైన అయ్యన్నపేట అయ్యన్న కోనేరులో వంగర మహంకాళి(30) సోమవారం మద్యం మత్తులో కోనేటిలో దిగి ఊపిరాడక మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయ్యన్నపేటకు చెందిన మహంకాళి సోమవారం మద్యం సేవించి, పాలనగర్ లో గల తన బావ దుకాణం వద్దకు వెళ్లి అనంతరం అక్కడ సమీపంలో గల అయ్యన్న కోనేరు వద్దకు చేరుకొని తన ఒంటిపై ఉండే బట్టలను, జంజం, మద్యం బాటిల్ గట్టుపై ఉంచి కోనేటిలోకి దిగినట్లు కోనేటి వద్ద శివాలయం నిర్మాణం చేస్తున్న కార్మికులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఒకటవ పట్టణ పోలీసులకు సమాచారం మేరకు అదృశ్యం కేసుగా నమోదు చేశారు. అయితే చీకటి పడడంతో నీటిలో గాలింపుకు అవకాశం లేనందున మహంకాళి కోనేటిలో మృతి చెందాడ లేదా అనేది ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది.

వివేకా హత్యకేసు విచారణలో తాత్సారం

విశాలాంధ్ర-నెల్లిమర్ల: మాజీ ఎంపీ కీర్తిశేషులు వివేకానంద రెడ్డి హత్యకేసు విచారణలో పోలీసులు తాత్సారం చేస్తున్నారని పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు అన్నారు. నెల్లిమర్లలో టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్చార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో సోమవారం వివేకానంద మర్డర్ సంబంధించి జగనాసుర రక్త చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళావెంకటరావు మాట్లాడుతూ ఏళ్లు గడుస్తున్నా వివేకానంద హత్యకేసు విచారణ పూర్తి చేయాలేదన్నారు. కార్యక్రమంలో విజయనగరం పార్లమెంటరీ మహిళ అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, నెల్లిమర్ల మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, నాయకులు కంది చంద్రశేఖర్, ఆకరి ప్రసాద రావు, సువ్వాడ రవిశేఖర్, కర్రోతు సత్యనారాయణ, లెంక అప్పలనాయుడు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఈనెల 12వ తేదీన ఈస్ట్ గోదావరి జిల్లా కాకినాడలో జరిగిన 38వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ తైక్వాండో పోటీలలో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిమ ప్రదర్శించి 11 పతకాలు సాధించారు. వీటిలో గోల్డ్ మెడల్ 1, సిల్వర్ 4, బ్రౌన్జ్ 6 సాధించి ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లో మూడో స్థానాన్ని సాధించారు. వీరికి జిల్లా తైక్వాండో అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు అభినందనలు తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

బ్యాంకు వినియోగదారులకు ఆర్బీఐ అప్రమత్తం

పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ సూర్యకుమారి

విశాలాంధ్ర -విజయనగరం: బ్యాంకు విని యోగదారులను అప్రమతం చేయ దానికి రిజర్వ్‌బ్యాంకు అఫ్ ఇండియా పలు సూచనలు చేసింది. ఇందుకు సంబంధించి ప్రజల్లో అవగాహన పెంచ దానికి పోస్టర్లను ముద్రిం చింది. సరైన ఆర్థిక వ్యవహారమే మిమ్మల్ని కాపాడుతుంది అనే నినాదంతో ముద్రిం చిన ఈ పోస్టర్లను స్పందనలో కలెక్టర్ సూర్యకుమారి, ఎల్.డి.ఎం శ్రీనివాసరావు, బ్యాంకుఉన్నతాధికారులు ఆవిష్కరించారు. ఇప్పుడు పొదుపుచేయండి, భవిష్యతును సురక్షితం చేసుకోండి, పొదుపు చేసే అలవాటే మిమ్మల్ని ఆర్థిక ఇబ్బందులనుండి కాపాడగలదు అనే విషయాన్ని ప్రజలు గమనించాలని ముద్రించారు. ఓ.టి.పి, పాస్ వర్డ్స్ పిన్ లేదా బ్యాంకు ఖాతా వివరాలను ఇతర వ్యక్తిగత వివరాలను ఎవ్వరితోనూ పంచుకోకూడదని పోస్టర్ల ద్వారా చైతన్యం చేయడం జరుగుతుందని ఎల్.డి.ఎం తెలిపారు. ఫోన్ లో గోప్యమైన సమాచారం అనగా కాంటాక్ట్ మెసేజ్ లు, లోకేషన్, కెమెరా, గ్యాలరీ వంటి మొదలైన వాటిని ఎవరైనా వాడేందుకు అనుమతించే ముందు జాగ్రత్త వహించాలన్నారు. కష్టబడి సంపాదించిన డబ్బు విలువైనదని, తెలివిగా ఖర్చు చేయాలనీ, ముందుగా బడ్జెట్ చేయు, తర్వాత ఖర్చు చేయు అనే అంశాలను పోస్టర్ నందు పొందుపరచారు. రుణాలు పొందాలనుకునే వారు నియంత్రిత సంస్థల నుండే, అవసరం ఉన్నంతే రుణాలు తీసుకోవాలని ఆర్.బి.ఐ అవగాహన కలిగిస్తోంది.

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అధికారులతో సమావేశం

విశాలాంధ్ర-దత్తిరాజేరు: తహసీల్దార్ కార్యాలయం లో సోమవారం తహసీల్దార్ పి.రమేష్ ఆధ్వర్యంలో అధికారులతో సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండల స్థాయి లో తహసిల్దార్‌తో కూడిన టీం, గ్రామస్థాయిలో పంచాయతీ సెక్రెటరీ, వీఆర్వో, మహిళా పోలీసు ఉంటారు. ఈ టీమ్‌లు ఓటర్లను ఎలాంటి మభ్యపెట్టే కార్యక్రమాలు చేయకుండా చూస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో, రోడ్లపైన, బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్లు, పోస్టర్లు, నిషేధమని తెలియజేశారు. పర్మిషన్ లేకుండా ఎటువంటి అనౌన్స్మెంట్ సమావేశాలు నిర్వహించరాదన్నారు. నిబంధనల అతిక్ర మిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడును అని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఈవోపీఆర్డి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కరపత్రాలు విడుదల

విశాలాంధ్ర- పార్వతీపురం: ఆర్థిక అక్షరాస్యత ప్రతీఒక్కరికి అవసరమని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యతపై రిజర్వు బ్యాంకు ఆదేశాలమేరకు రూపొందించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ జె.ఎల్.ఎస్. మూర్తి మాట్లాడుతూ మంచి ఆర్థిక ప్రవర్తన మిమ్ములను కాపాడుతుంది అనే నినాదంతో రిజర్వు బ్యాంకు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమానికి పిలుపునిచ్చిందన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను ఈనెల 17వరకు పాటించడం జరుగుతుందని, ఇందులో భాగంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఏపి జివిబి ప్రాంతీయ మేనేజర్, ఎస్.బి.ఐ, డి.సి.సి.బి తదితర బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెళ్ళికానుక



విశాలాంధ్ర -మక్కువ: మండలంలో వెంకటభైరిపురం గ్రామంలో సోమవారం ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్పంచ్ మరడ వెంకటరత్నం యడ్ల గంగులు కుమార్తె యడ్ల వెంకటలక్ష్మీ కి పెళ్లి కానుకగా రూ.10వేలు, చీర జాకెట్టు, గాజులు, పసుపు కుంకుమ నిమిత్తం ఇచ్చారు. ఈ పెళ్లి కానుకలను అందుకొని వారి ఆశీస్సులు తీసుకున్నారు. గత 4 ఏళ్లుగా జరిగే ఈ పెళ్లికానుక కార్యక్ర మం ఇకముందు కూడా ప్రతీ ఆడపడుచుకు అందుతుందని సర్పంచ్ మరడ వెంకటరత్నం ఈ సందర్భంగా తెలియపరిచారు. వారికి మా ఎంఎస్ఆర్ ఫౌండేషన్ తరుపున, మా గ్రామం తరపున ప్రత్యేక ధన్యవాదాలు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మరడ శ్రీనివాసరావు, యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధునికి గాయాలు

విశాలాంధ్ర-బెలగాం : ఆర్టీసీ బస్ ఢీకొని వృద్ధునికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం ఉదయం జరిగింది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం నాగూరు గ్రామానికి చెందిన నారనాధ అప్పారావు స్థానిక కోదండరామా రైస్ మిల్లులో వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. తన విధులు ముగించుకొని నడుచుకుంటూ ఇంటికి వెళుండగా పార్వతీపురం నుండి వీరఘట్టం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్ వెనుక నుండి ఢీకొనడంతో అప్పారావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తంలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

స్పందన దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించండి : కలెక్టరు నిశాంత్‌కుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం : స్పందన గ్రీవెన్స్‌లో వచ్చిన పిర్యాదులు త్వరితగతిన పరిష్కారం చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ స్పష్టం చేశారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్పందన కార్యక్ర మాన్ని కలెక్టరు నిశాంత్‌కుమార్ నేతృత్వంలో జాయింటు కలెక్టరు ఒ.ఆనంద్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణుచరణ్, జిల్లా రెవిన్యూ అధికారి జి.వెంకటరావులు నిర్వహించి ప్రజలనుండి 90 అర్జీలు స్వీక రించారు. తోటపల్లి రిజర్వా యర్ బ్యారేజ్ ఎడమ కాలువకు సంబంధించిన ఒకటి, రెండవ బ్రాంచ్ కెనాల్స్ ప్రస్తుతం పని చేయకపోవడం వల్ల కౌలురైతులు ఇబ్బందిపడుతున్నారని, తక్షణమే సాగునీరుని విడు దల చేయవలసిందిగా గరుగుబిల్లి మండలం నాగూరు గ్రామానికి చెందిన ఎ.మధుసూ దనరావు దరఖాస్తు అందజేశారు. దీంతోపాటు గరు గుబిల్లి మండల పరిధిలో ఉన్న అన్నిగ్రామాలలో రైతులకు సంబంధించి సుమారు 5వేల మెట్రిక్ టన్నులు ధాన్యం బస్తాలను కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారని అతనే మరో అర్జీ అందజేశారు. మక్కువ మండలం ఆలగరువు గ్రామానికి చెందిన ఎస్.నాగేశ్వరరావు ఆలగరువు, పనసభద్ర ఉపాధిహామీపథకం క్రింద గ్రావిల్ రోడ్డువేసామని, దానికి ఆడిట్ కూడా జరిగిందని, సంబంధించిన బిల్లులు మంజూరు చేయవలసిందిగా వినతిపత్రం సమర్పించారు. మక్కువ మండలం కవిరిపల్లి గ్రామానికి చెందిన ఆర్.కృష్ణమూర్తి సర్వే నెంబర్ 70,71,72 తన యొక్క భూమిని సర్వే చేసి ఉన్నారని, అయితే ఇతరుల పేరు మీద నమోదు చేశారని, పాస్‌పుస్తకం, టైటిల్ డిడిలో తనపేరు నమోదుచేయాలని కోరారు. మక్కువ మండలం లోతుగడ్డ గ్రామానికి చెందిన రైతులు గత 22 సంవత్సరాలుగా సర్వే నెంబర్ 164లో భూమిని సాగు చేస్తున్నామని ఆ భూమికి పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేయవలసిందిగా టి.కస్తురీ, ఇతరులు కోరారు.పార్వతీపురం మండలం పుట్టూరు గ్రామానికి చెందిన కె. రమేష్,పి.శివుడు, డి.పద్మ పుట్టూరు గ్రామపంచాయతీలో గ్రీన్ అంబాసిడర్ గా విధులు నిర్వహిస్తున్నామని, 11 మాసాలుగా జీతం అందడంలేదని పిర్యాదు చేశారు.మక్కువ మండలం సంబర గ్రామానికి చెందిన జి.లక్ష్మణరావు రైతు భరోసా కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలుచేయాలని దరఖాస్తు అందజేశారు. కొమరాడ మండలం మాదిలింగి గ్రామానికి చెందిన ఎ.పకీర్ నాయుడు సర్వే నంబర్100 లో 1-50 భూమిని వేరే వాళ్ళు ఆక్రమణచేసి ఉన్నారని, వారిపైన చర్యలు తీసుకోవాలని కోరారు. పార్వతీపురం మండలం కోటవానివలస గ్రామానికి చెందిన జి.కళావతి విడో పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.సీతానగరం, పాలకొండ తదితర మండలాల్లో ఉండే ధాన్యం నిల్వలను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం కార్యదర్శి రెడ్డి. లక్ష్మునాయుడు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి డా. ఎస్.వి.రమణ, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.బి.జగన్నాథరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు గడువు పెంచాలి : ఏపీ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-పాలకొండ: రైతుల వద్ద ఉన్న ధాన్యం అంతటినీ కొనుగోలు చేయాలని, అలాగే కొనుగోలు గడువు పెంచాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం రైతులతో కలిసిన ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అన్ని గ్రామాల్లో సచివాలయాల వద్ద నిరసనలు, ధర్నాలు చేపట్టారు. ఫిబ్రవరి 13 నుంచి 20వ తేదీ వరకు నిరసనలు చేపడుతున్నామని, అందులో భాగంగా వీరఘట్టం మండలం, తూడి గ్రామం, రేగులపాడు తదితర గ్రామాల్లో సచివాలయాల వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మన్యం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తంపటాపల్లి గ్రామ సచివాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం సంక్రాంతి పండగ తరువాత ధాన్యం సేకరణ పనులు నిలిపివేయడంతో రైతులు తీవ్ర ఆందోళన చేపట్టారు. జనవరి 21న కలెక్టర్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి ఆందోళనకు దిగడంతో పాలకొండ, వీరఘట్టం మండలాలతోపాటు జిల్లాలో 20వేలు మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం సేకరించినప్పటికీ ధాన్యం సేకరణ చేయకుండా వివిధ రూపాల్లో కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రైతు సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నిరశిస్తూ ఉద్యమం చేశామని తెలిపారు. ఫిబ్రవరి 13 నుంచి 20 వరకు సచివాలయాల వద్ద సంతకాలు సేకరణ చేయడం జరుగు తుందని, అనంతరం మండల తహాశీల్దార్ కార్యాలయాల వద్ద రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని, ఫిబ్రవరి 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనలు చేస్తామని ఇప్పటికే జిల్లా సంయుక్త కలెక్టర్‌కు నోటీసులో తెలపడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగా సచివాలయాల వద్ద తీవ్ర ఆందోళనలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా రైతుల వద్ద నుంచి ఉన్న ధాన్యం కొనుగోలు చేసి గడువు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి. రమణారావు, సర్పంచ్ బాబాజీ, ఎ. రాజేంద్రప్రసాద్, శ్రీధర్, రమణ, ఎస్. వెంకటరమణ, వి. లక్ష్మునాయుడు, వి. కూర్మారావు, రైతులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్: ధాన్య సేకరణ గడువు పెంచాలని, ధాన్యం కొనుగోలు జరిగేంతవరకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండలం లోని సంగంవలస గ్రామ సచివాలయం వద్ద రైతులతో నిరసన వ్యక్తం చేసింది. ఈ నిరసన కార్యక్రమం లో పాల్గొన్న రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యంకొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు అధికారులు పంట పొలాల్లో ఉన్న పంటను ఈ క్రాప్‌లో నమోదుచేసి పండించిన పంటకు కూడా ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. మదుపులు పెట్టి వాటిని అప్పులు తీర్చలేక అనేక ఇబ్బందులుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం సేకరించాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు భరోసా కేంద్రం వద్ద వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు వెలమల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థి మృతి

పాఠశాల హెచ్ఎం లక్ష్మీకాంతం వెల్లడి

విశాలాంధ్ర-కొమరాడ: మండలంలోని ఉలిపిరి గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కోలక సుమిత్ర మృతి చెందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీకాంతం తెలి పారు. ఆదివారం ఉదయం మెడ భాగంలో నొప్పి వచ్చిందని చెప్పడంతో వెంటనే ఆశ్రమం పాఠశాలలో ఉన్న ఏఎన్ఎం సహాయంతో కునేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. అక్కడ తనిఖీ చేసిన వైద్య సిబ్బంది పార్వతిపురం జిల్లా ఆస్పత్రులకు రిఫర్ చేశారు. పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో వైద్యులు తనిఖీలు చేపట్టి ఫిట్స్‌కు సంబంధించిన వ్యాధిగా గుర్తించి చికిత్స అందించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో విజయనగరం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు అక్కడ కూడా పరిస్థితి విషమించడంతో ఆదివారం కెజిహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. సోమవారం ఉదయం ఏడున్నర గంటల సమయంలో బాలిక మృతి చెందినట్లు హెచ్ఎం తెలిపారు. విద్యార్థి సొంత గ్రామం నయా గ్రామం చెప్పారు. ఈ మేరకు వైద్యులు పాఠశాల సిబ్బంది విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. గతంలో విద్యార్థినికి ఫిట్స్ వ్యాధి ఉండేదని కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఏటి డబ్ల్యూఓ సురేష్‌కుమార్ తెలిపారు. మృతిచెందిన బాలిక ఉలిపిరి పాఠశాలలో ఐదోతరగతి నుంచి చదువుతుంది. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని గిరిజనులు కోరుతున్నారు. గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఐటీడీఏ తరఫున కొంతమేరకు ఆర్థిక సహాయం చేసినట్లు సమాచారం

తాబేలవలస లో మౌలిక సదుపాయాలు కల్పించాలి : సీపీఐ

విశాలాంధ్ర-కురుపాం: తాబేలవలస గ్రామానికి మంచినీటి బోరు, రోడ్డు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, కుండంగి లింగ రాజు డిమాండ్ చేసారు, తాబేలవలస గ్రామంలో మౌలిక సదు పాయాలను కల్పించాలని కురుపాం మండల తాహిశీల్దార్ ఆఫీసు ముందు ధర్నా సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. మౌలిక సదుపాయాలను కల్పిం చాలని తహశీల్దార్ కి వినతిపత్రం ఇచ్చారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ మొండింఖల్ పంచాయతీ పరిధిలోని తాబేలవలసలో సుమారు 30 గిరిజన కుటుంబాలు మౌలిక సదుపాయాలు లేక నానాఅవస్థలు పడుతున్నారన్నారు. తాగ డానికి మంచినీటి బోరువేయాలని, తాబేలవలస నుండి గోర్జపాడు పంచాయతీ రాజ్ రోడ్డు వరకూ రోడ్డువేయాలని, జగనన్న తరహా ప్రభుత్వం ఇల్లు నిర్మాణాలు చేపట్టాలని, గ్రామానికి మినీ అంగన్వాడీ సెంటర్ ను కేటాయించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. దీనిపై తహశీల్దార్ సానుకూలంగా స్పందించడమైనది, కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు పువ్వుల ప్రసాద్,



ఎస్సీల నిధులను విడుదల చేయాలి

కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే నిమ్మక వినతి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: ఎస్సీలకు రావలసిన న్యాయమైన నిధులను విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు నిమ్మక జయరాజు బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు అన్నారు సోమవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ నిశాంత్ కుమార్ కు జిల్లా ఎస్సీ మోర్చా అధ్య క్షులు పారిశర్ల అప్పారావు ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గత మూడు సంవత్సరాలుగా అమలుకానీ 26 పథకాలను వెంటనే పునరుద్ధరిం చాలని తద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో దాదాపు 10 లక్షల మంది ఎస్సీ యువత నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతుందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ యువత 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీలు చదివి పక్కరాష్ట్రాల్లో కూలీలుగా.. హోటల్ బాయ్స్‌గా, సెక్యూరిటీ గార్డు లాగా పనిచేస్తున్నారన్నారు అనేక సంవత్సరాలుగా కూలీలుగా బతుకుతూ ఎలాంటి సంపాదన లేక ఆహార భద్రత లేదు. ఎలాంటి వసతి లేదు. చాలామంది ఉద్యోగాలు లేక ఎదురుచూసి ఉద్యోగం చేసే వయసు కూడా అయిపోయిందని అలాంటి వారికి ప్రభుత్వం సొంత పూచికత్తుపై రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు ఎన్ ఎస్ ఎఫ్ డి సి కింద కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను, రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తున్నది రాజ్యాంగం ప్రకారం ఎస్సీలకు కేటాయించిన నిధులను దారి మళ్లిం చడం గాని, వృధాగా ఉంచడం కానీ నేరం. ఎస్సీ యువతకు ఒక లక్ష నుండి 50 లక్షల వరకు ఎలాంటి స్యూరిటీ లేని రుణాలు ఇప్పించాలని ప్రతి యాస్సి లబ్ధిదా రునికి మూడెకరాల భూమిని ఇప్పించాలని ఎస్సీ కాలనీలో రోడ్లు డ్రైనేజీలు మెరుగుపరచాలని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు తిరుపతిరావు, జిల్లా ట్రెజరర్ రంపల్లి ప్రభాకర్, జిల్లా జనరల్ సెక్రెటరీ తిరుపతి రావు, కాళిదాస్, సీతానగరం మండల అధ్యక్షులు బాలు, రాష్ట్ర అధ్యక్షులు లీల, మండల సెక్రెటరీ నాగభూషణ్, సాలూరు మండల అధ్యక్షులు దుర్గారావు, పార్వతీ పురం పట్టణ అధ్యక్షులు పేర్రాజు, పార్వతిపురం ఎస్సీ మోర్చా సెక్రటరీసుందర ఆనంద్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులను ఆదుకోండి : జనసైనికులు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: నిడగల్లు గ్రామంలో కిడ్నీ బాధితులను ఆదుకోవాలని జనసేన నాయకులు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జేసీ ఓ.ఆనంద్ ను కలిసి ఆ పార్టీ సీతానగరం మండల అధ్యక్షులు పాటి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు చెందక అనిల్ కుమార్, గొర్లి చంటి, వంగల దాలినాయుడు, బంటు శిరీష్, రాజాన రాంబాబు, సిరిపురపు గౌరీ శంకర్, రాజాన బాలు తదితరులు పార్వతీపురం జిల్లాలోని కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నిడగల్లు, పెద్దమరికి తదితర గ్రామాలు గూర్చి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరు నెలల క్రితం నిడుగల్లు గ్రామానికి సంబంధించి కిడ్నీ వ్యాధి విషయమై తాము ఫిర్యాదుచేయుగా ఒక రెండురోజులు గ్రామంలో సర్వే పేరుతో హడావిడి సృష్టించిన అధికారులు తర్వాత కనిపించలే దన్నారు. దీంతో గ్రామంలో కిడ్నీవ్యాధిగ్రస్తులు మృత్యువాతపడుతున్నారన్నారు. తక్షణమే గ్రామ స్తులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధిగ్రస్తులకు మందులు, ఆర్థిక సాయం చేయాలన్నారు. క్వారీల క్రషర్ బుగ్గివల్ల కూడా ప్రమాదం ఉందన్నారు. తక్షణమే సమస్యలన్నింటినీ పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా జేసీ కు వినతిపత్రాన్ని అందజేశారు.

రేపు అల్బెండ్‌జోల్, డిఈసి మాత్రల పంపిణీ : కలెక్టర్

- రెండేళ్ల వయస్సులోపు పిల్లలకు, గర్భిణులకు, అనారోగ్యంతో ఉన్నవారికి మాత్రలు వేయరాదు
- ఖాళీ కడుపుతో మాత్రలు తీసుకోరాదు

విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం: జిల్లాలో అల్బెండజోల్, డి ఇథైల్ కార్బమజైన్ సిట్రెట్ (డి.ఇ.సి) మాత్రల పంపిణీ కార్యక్రమం ఈనెల 15న బుదవారం జరుగుతుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. నులిపురుగులు, ఏలిక పాముల నివారణకు, తద్వారా సంభవించే రక్త హీనత నివారణకు అల్బెండజోల్, డి.ఇ.సి మాత్రలు ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. సోమ వారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా అల్బెండజోల్, డి.ఇ.సి మాత్రల పంపిణీపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మందులపంపిణీ పక్కాగా జరగాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. 15న మందులు తీసుకోనివారికి 16, 17 తేదీల్లో పంపిణీ జరుగుతుందని ఆయన వివరించారు. 2నుండి 5 సంవత్సరాల వయస్సుగల చిన్నారులకు వంద మిల్లీ గ్రాముల డి.ఇ.సి మాత్ర ఒకటి, నాలుగు వందల మిల్లీ గ్రాముల అల్బెండజోల్ మాత్ర ఒకటి పంపిణీ చేయాలని ఆయన సూచించారు. 6 నుండి 14 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు రెండు వందల మిల్లీ గ్రాముల డి.ఇ.సి మాత్రలు రెండు, నాలుగు వందల మిల్లీ గ్రాముల అల్బెండజోల్ మాత్ర ఒకటి పంపిణీ చేయాలని, 15 సంవత్సరాల వయస్సు పైబడిన వారికి మూడు వందల మిల్లీ గ్రాముల డి.ఇ.సి మాత్ర మూడు, నాలుగు వందల మిల్లీ గ్రాముల అల్బెండజోల్ మాత్ర ఒకటి పంపిణీ చేయాలని ఆయన సూచించారు. పాఠశాలలలో శత శాతం మాత్రలు పంపిణీ జరుగుటకు జిల్లా విద్యా శాఖ అధికారి అందరు ప్రధాన ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేయాలని, అంగన్వాడీ, వసతి గృహాలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, మున్సిపాలిటీలలో శత శాతం మాత్రలు పంపిణీ జరుగుటకు సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు. మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బగాది జగన్నాథ రావు మాట్లాడుతూ రెండు సంవత్సరాల వయస్సు లోపు పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, తీవ్రమైన అనారోగ్యంతో ఉన్నవారికి మాత్రలు వేయరాదని అన్నారు. ఆహారం తీసుకున్న తర్వాత మాత్రమే మాత్రలు వేయాలని, ఖాళీ కడుపుతో మాత్రలు తీసుకోరాదని ఆయన పేర్కొన్నారు. మాత్రల వలన ప్రయోజనం కలుగుతుందని, దుష్ప్రభావాలు ఉండవని చెప్పారు. మాత్రలు వేసుకొన్న అనంతరం ఆరోగ్యంలో మార్పులు, అస్వస్థత కలుగుతున్నట్లు సందేహం కలిగితే వెంటనే దగ్గరలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి విజయనగరం, పశ్చిమ గోదావరి జిల్లాలలో నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్, పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణుచరణ్, జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకటరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం

విశాలాంధ్ర-బెలగాం: సీతానగరం మండలం వెంకటా పురం (కామం దొరవలస) గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంను పార్వతీపురం ఏరియా ఆసుపత్రి వైద్యాధికారిణి జి.ఆశాలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అన్ని వైద్య పరీక్షలు చేసి ఆహారపు అలవాట్లలో కొన్ని సూచనలు చేసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారికి కావలసిన మందులు నెలకు సరిపడినవి ఇస్తున్నామని, గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వెళ్ళి అక్కడి పిల్లల ఆరోగ్య వివరాలు అడిగి వారికి కావలసి మందులిచ్చి జాగ్రతలను తీసుకోవాలని సూచించామని, ప్రజలంతా వైద్యసేవలు వినియెగించుకోవాలని కోరుతు న్నామని తెలిపారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, ప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

డి.టి.ఓ గణేష్ మృతికి నివాళి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: విజయనగరం జిల్లా ఖజానా శాఖాధికారి ఎస్.ఆర్.కె. గణేష్ మృతి పట్ల పార్వతీపురం జిల్లా ఖజానా శాఖ అధికారులు, సిబ్బంది సోమవారం నివాళులు అర్పించారు. పార్వతీపురం జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో జిల్లా ఖజానా అధికారి ఎ. మన్మథ రావు నేతృత్వంలో సహాయ ఖజనా అదికారి కె. శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది గణేష్ మృతి పట్ల విచారం వ్యక్తం చేసారు. డి.టి.ఓ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు. డి.టి.ఓ కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని అందించాలని కోరారు.

రఘురాం కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రోగ్రాం కోఆర్డినేటర్, వైసీపీ శాసన మండలి సభ్యులు తలసీల రఘురాం సతీమణి స్వర్ణకు మారి ఇటీవల మృతిచెందగా విషయం తెలుసుకున్న పార్వతీపురం నియోజకవర్గం శాసనసభ్యులు అలజంగి జోగారావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేయడమే కాకుండా సోమవారం విజయవాడ గొల్లపూడిలోని తలశిల రఘురాం నివాసానికి చేరుకున్న ఎమ్మెల్యే జోగారావు స్వర్ణకు మారి చిత్రపటానికి నివాళు లర్పించారు. అనంతరం రఘురాం కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని ఎమ్మెల్యే తెలిపారు.

జామి ఎల్లారమ్మ జాతరకు చందాలు వసూలు ఆపాలి

దేవాదాయశాఖ అధికారులకు మాజీ జెడ్‌పిటిసి పెదబాబు ఫిర్యాదు

విశాలాంధ్ర-జామి: ఉత్తరాంధ్రలో పేరున్న పద్ద పండగలలో ఒకటైన జామి శ్రీఎల్లారమ్మ జాతరకు సంభందించి ఉత్సవ నిర్వాహక కమిటీ ప్రజలు వ్యాపారులు, ఉద్యోగులనుంచి భారీ బలవంతపు వసూళ్ళకు పాల్పడుతున్నారని, వెంటనే ఈచర్యలను అరికట్టాలని మాజీ జెడ్‌పిటిసి బండారుపెదబాబు దేవాదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేసారు. ఈమేరకు విశాఖలోని డిప్యూటీ కమీషనర్‌ను కలుసుకున్న ఆయన గ్రామంలో దౌర్జన్యం గా వసూళ్ళు జరుగుతున్నాయని తీసుకున్న మొత్తానికి ఎటువంటి అధరైజ్ట్ రశీదులు ఇవ్వడం లేదని తెలిపారు. వసూలు చేసిన నగదును తిరిగి వారికి ఇచ్చేయాలని కోరారు. దీనిపై స్పందించిన డిసి వెంటనే విజయనగరంలోని ఎసిని దర్యాప్తు చేయాలని ఆదేశించారన్నారు. తాను ఈఫిర్యాదును సిఎంకు, రాష్ట్ర కమీషనర్‌కు పంపించడం జరిగిందని పెదబాబు తెలిపారు.

శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా చెల్లూరి రమణ

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని క్లబ్ పెద్దలు, సభ్యులందరి సమక్షంలో ఆదివారం జరిగిన క్లబ్ కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.2023 సంవత్సరంనకుగాను క్లబ్ నూతన అధ్యక్షుడిగా చెల్లూరి శ్రీనివాసరావు(సి. హెచ్.రమణ), కార్యదర్శి గా కోట్ల సత్యనారాయణ, కోశాధి కారిగా గుదే గోవిందరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు క్లబ్ పి.ఆర్. ఓ. త్యాడ రామకృష్ణా రావు(బాలు) తెలిపారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు పతివాడ నారాయణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో క్లబ్ పెద్దలు పిన్నింటి సూర్యనారాయణ,డాక్టర్ ఎ.ఎస్. ప్రకాశ రావు, ఎడ్ల గణేష్, ఎ.తిరుపతిరావు పర్యవేక్షణలో ఈ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు,త్వరలోనే నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సి.హెచ్. రమణ మాట్లాడుతూ తనపైన ఉన్న నమ్మకంతో ఎన్నిక చేసినందుకు క్లబ్‌సభ్యులకు,పెద్దలకు, శ్రేయోభిలాషులకు ధన్యవా దాలు తెలుపుతూక్లబ్ మరింత అభివద్ధికి సభ్యులందరినీ కలుపుకుపోతూ అహర్నిశలు శ్రమిస్తానని, వాకర్స్ ఇంటర్నేషనల్ మరియు క్లబ్ పెద్దల సలహాలు సూచనలతో సేవా కార్యక్రమాలను చేపడుతూ క్లబ్ అభివృద్ధిపథంలో నడిపిస్తానని అన్నారు.

15న రహదారి భద్రతా కమిటీ సమావేశం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: రహదారి భద్రత కమిటీ సమావేశాన్ని ఈ నెల 15వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా రవాణాశాఖాధికారి సి.మల్లికార్జున రెడ్డి సోమవారం తెలిపారు. 15వ తేదీ ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమిటీ సమావేశం జరుగుతుందన్నారు. జిల్లాలో శాఖల వారీగా చేపట్టాల్సిన రహదారి భద్రతా కార్యక్రమాలపై సమావేశంలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని రహదారి భద్రతా కమిటీ సభ్యులు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చేరాలి

ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్. కేశవరావు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్తి సౌకర్యాలు, వసతులు న్నాయని, ఇంటర్ పాసైన విద్యార్థులు ఈ కళాశాలలో చేరాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. కేశవరావు కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్ క్యాంపైనింగులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలను సోమవారం సందర్శించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నటువంటి సౌకర్యాలు, ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ, డిజిటల్ క్లాసెస్, వర్చువల్ క్లాసెస్, మోడ్రన్ జిమ్, డిజిటల్ లైబ్రరీ, జేకేసీ మొదలగు వసతులన్నీ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఓఎండీసీలో ఆన్లైన్ ప్రక్రియ మా కళాశాలలోనే జరుగుతుందని కోఆర్డినేటర్ జీ.ఈరన్న తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర ఉపన్యాసకులు చల్లా శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ వలిఖాన్, జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ నాయుడు, అధ్యాపకులు నాగు, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగుల వెతలు తీర్చాలి

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

విశాలాంధ్ర-భోగాపురం: భోగాపురం తాలూకా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జక్కపు ఉమా మహేశ్వరరావు అధ్యక్షతన సంఘ కార్యాలయం లో సోమవారం సమావేశం నిర్వహిం చారు. ఉద్యోగుల వెతలు తీర్చాలి అందుకు అనుగుణంగా చట్టంచేయాలని ఉద్యోగుల సమన్వయ సమావేశంలో అన్ని సంఘాల నాయకులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. జీతాలు-చట్ట బద్ధత అన్న అంశమై జరిగినఉద్యోగ సంఘాల సమన్వయ సమావేశంలో విజయనగరం జిల్లా కార్యదర్శి కంది వెంకటరమణ ప్రత్యేక అతిధిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో,ప్రజలకు సేవలందించడంలో నిరంతరం శ్రమిస్తున్న ఉద్యోగులకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలు,నెలవారి జీతాలు ఇవ్వడంలో ప్రభుత్వంనిర్లక్ష్యం వహించుట సరికాదన్నారు. ఉద్యోగ,ఉపాధ్యాయ, పింఛన్ దార్లు 1 వ తేదీన జీతాలు అందక లోన్సు ఈ ఎం ఐ లు సకాలంలో కట్టక పోవడం వలన అపరాధ రుసుము కట్టడంతో పాటు,సిబిల్ పాడై భవిష్యత్ లో లోన్స్ వచ్చే అవకాశాలు కోల్పోచున్నారు. నెలవారి అద్దెలు,నిత్యావసర సరుకులు కొనడానికి బాకీలు కట్టడానికి ఇబ్బందు లు పడుతున్నారని,1వ తేదీనే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చేటట్లు చట్టంచేసి అమలుచేయాలని వెంకటరమణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎల్.వి యుగంధర్, కోశాధికారి వై.శంకరరావు,రాష్ట్ర పింఛన్ దార్ల నాయకులు పి.వి.రమణ, తాలూకా వీఆర్వోల సంఘం అధ్యక్షులు ఎస్.అప్పలనాయుడు, యుటిఎఫ్ సంఘం అధ్యక్షులు రాములప్పుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యం పై శ్రద్ధవహించాలి

విశాలాంధ్ర-బొబ్బిలి: విద్యార్థులు ఆరోగ్యంపై తల్లితండ్రులు, ఉపాధ్యాయులు వైద్య ఆరోగ్య సిబ్బంది శ్రద్ధచూ-ాలని నారాయనప్పవలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెసి రాజు అన్నారు. సోమ వారం పాఠశాలలో పిరిది ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య ఆరోగ్య సిబ్బంది పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కు ఫైలేరియా, నులి పురుగుల నివారణా మాత్రలను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా జె సి రాజు మాట్లాడు తూ ఇంటి పరిసరాలు మురుగు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమల కారకంగా వచ్చే బోధకాలు వ్యాధిపై అవగాహన ఏర్పరిచారు. అలాగే వ్యక్తి గత పరిశుభ్రత, చేతులను ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవటం ద్వారా నులిపురుగుల బారినపడకుండా ఉండవచ్చని అన్నారు. ఫైలేరియాకు డిఈసి మాత్రలను నులి పురుగులకి అల్బెన్ డోజల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు ఏ.రామకృష్ణ, ఎన్.బంగారమ్మ, సైన్స్ ఉపాధ్యాయులు ఎం శ్రీనివాసరావు ఆశాలు జయలక్ష్మీ, లలిత లు పాల్గొన్నారు.

టీడీపీ విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖరుకి రాష్ట్ర నాయకులు పరామర్శ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంట్ ఉపాధ్య క్షుడు, నియోజకవర్గ సీనియర్ నాయకుడు రాయవరపు చంద్రశేఖర్ తండ్రి అప్పల నాయుడు మాస్టారు ఇటీవల మృతి చెందారు. ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ చంద్రశేఖర్ ని రాష్ట్ర పార్టీ కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకులు కిల్లి వేణుగోపాల్ స్వామి, జాతీయ పార్టీ కార్యదర్శి, జిల్లా టీడీపీ రైతు పార్లమెంట్ కార్యదర్శి లుకలాపు రాంబాబు, తెలుగు యువత కార్యదర్శి హరికృష్ణ తదితరులు పరామర్శించారు.

టిడిపి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలి

మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే టిడిపి ఇంచార్జ్ బొబ్బిలి చిరంజీవులు అన్నారు. సోమవారం మండలంలోని జమదల పంచాయతీ లక్ష్మీపురం గదబావలస గ్రామాల్లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వపాలన ఉన్న వ్యతిరేకత దానిని అనుకూలంగా మార్చుకోవాలన్నారు. ప్రతి కార్యకర్త సైనికుల పనిచేయాలని తెలిపారు. రానున్న రోజుల్లో చంద్రబాబు నాయుడు ను ముఖ్యమంత్రిని చేసేంత వరకు అందరం కష్టపడే పని చయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను వైసిపి ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. గ్రామాల్లో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయని కనీసం ఒక అభివృద్ధి పనికూడా చేపట్టలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. అదేవిధంగా విద్యుత్ చార్జీలు ఆర్టీసీ చార్జీలు నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెంచి ప్రజలపై ఆర్థిక భాగాన్ని తప్ప ఇంకేమీ చేయలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలపై దృష్టారించి పరిపాలన కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు వెంకట్ నాయుడు మండల డి మోహన్ రావు మండల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి బోనుదేవి చంద్రమౌళి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలో డిఈసి మాత్రలు పంపిణీ

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాస్‌డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల పరిషత్ అధ్యక్షులు, ఎంపీడీఓ కడుపులో నులి పురుగులు చేరకుండా ఆల్బండజోల్, బోధవ్యాధి రాకుండా ముందస్తుగా డి.ఈ.సి.మాత్రలను స్కూల్ విద్యార్థులకు ఎంపీపీ.ఉమాలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. తదుపరి ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ రెండు ఏళ్లు మొదలుకొని ఏ వయస్సు వారైనా నులిపురుగులు, బోధవ్యాధి బారిన పడకుండా ముందస్తుగా మందులను వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెర్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యఅధికారులు,మండల విద్యాశాఖధికారి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంతకాలం విద్యార్థుల మరణాలు? పరిష్కారం లేదా?

విశాలాంధ్ర-పార్వతీపురం: ఎంతకాలం గిరిజన విద్యార్థుల మరణాలని, దేనికి పరిష్కారం లేదా?అని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ప్రశ్నించారు. సోమవారం విశాఖ కేజీహెచ్ లో గిరిజన విద్యార్థి కోలక సుమిత్ర మృతిచెందిన నేపథ్యంలో రంజిత్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం ఉలిపిరి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సుమిత్ర కు ఫిట్స్, వాంతులు అయిన నేపథ్యంలో కూనేరు రామభద్రపురం ప్రాదమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెల్లగా పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి పంపించారు. అక్కడి నుండి విజయనగరం మహారాజ ఆసుపత్రికి, అక్కడి నుండి విశాఖపట్నం కేజీహెచ్ కు పంపించారు. చికిత్స పొందుతూ సుమిత్రా ఈరోజు ఉదయం మరణించిందని, పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు పొందటానికి ఎంతకాలం వేచి ఉండాలని ఆవేదన వ్యక్తంచేశారు. ఎంఆర్ఐ స్కానింగ్ కోసం విజయ నగరం ఆసుపత్రికి రిఫర్ చేసామని సిబ్బంది చెప్పారని రంజిత్ కుమార్ తెలిపారు. ప్రతీ సంవత్సరం పదుల సంఖ్యలో గిరిజన విద్యార్థులు మరణిస్తున్న ప్రభుత్వాలు ఎందుకు మరణాల నివారణకు చర్యలు తీసుకోవడం లేదని రంజిత్ కుమార్ ప్రశ్నించారు. గత ప్రభుత్వం గిరిజన విద్యార్థుల మరణాల నివారణకు"ఆదివాసీ ఆరోగ్యం"పేరుతో గిరిజన విద్యా సంస్థలు మొదలు కేజీ హెచ్ వరకు వైద్య సిబ్బందిని(హెల్త్ వాలంటీర్లు)నియమిస్తే ఈ ప్రభుత్వం వారి సేవలు ఎందుకు రద్దు చేసిందని రంజిత్‌కుమార్ ప్రశ్నించారు. పార్వతీ పురం గిరిజన కళాశాల వసతిగృహంలో నాసిరకం భోజనాలు పెడుతున్న వార్డన్ పై ఎందుకు చర్యలు తీసుకోలేదని జిల్లా అధికార యంత్రాంగానికి రంజిత్ ప్రశ్నించారు. నాసిరకం భోజనాలు పెడుతున్న వార్డన్ ను కనీసం బదిలీ కూడా చేయలేరా అని ప్రశ్నించారు.విద్యార్థినీ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని, దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఖజానా శాఖాధికారి గణేష్ కి నివాళి, సంతాపం

సంతాపం తెలుపుతున్న అధికారులు, సిబ్బంది

విశాలాంధ్ర-విజయనగరం: విజయనగరం ఖజానా శాఖాధికారి ఎస్.ఆర్.కె. గణేష్ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది సంతాపం ప్రకటించారు. స్థానిక ఖజానా శాఖ కార్యాలయంలో సోమవారం గణేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఖజానా శాఖ డీడీ ఆర్.ఎ. సమర్పణ కుమార్, ఏటీవోలు నితిన్ జోషి, ఆదిత్య సింగ్, ఇతర అధికారులు, సిబ్బంది పద్మనాభం, ఆదినారాయణ, రామరాజు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా అంతర్ జిల్లాల ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీలు

విశాలాంధ్ర-బెలగాం : అంతర్ జిల్లాల ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీలు పార్వతీపురంలో సోమవారం స్థానిక ప్రభు6 జూనియర్ కళాశాల ప్రాంగణంలో 66వ ఆంధ్రప్రదేశం ఆర్చరీ (విలువిద్యా) పోటీలు ప్రారంభమయ్యాయి. 2023-24 సంవత్సరపు అంతర జిల్లాల అండర్ 14-17 సంవత్సరాల బాలబాలికల విలువిద్యా క్రీడా పోటీలను జేసీ ఓ.ఆనంద్, పోలీసు సూపరింటెండెంట్ వి.విద్యాసాగర్ నాయుడు జ్యోతి ప్రజ్వన చేసి జాతీయ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ పోటీలు ఈనెల 15 వరకు మూడు రోజులు పాటు జరగనున్నాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలో గల అన్ని జిల్లాల నుండి 250 మంది బాలురు, 250మంది బాలికలు, 15మంది సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. ఈ విలువిద్యా పోటీలు రిజర్వు, కాంపౌండ్, ఇండియన్ రౌండ్స్ మూడు విభాగాల్లో నిర్వహిస్తున్నారు. జేసీ ఓ.ఆనంద్ మాట్లాడుతూ క్రీడాకారులు అందరూ ఆత్మ స్థైర్యంతో, పట్టుదలతో ఏకాగ్రతతో ఆడాలని అలా ఆడితే పతకాలు, గెలుపు సిద్ధిస్తాయని చెప్పారు. ప్రతి ఒక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. జిల్లా నుండి ఖచ్చితంగా అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని మెడల్స్ సాధించి రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వి.విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని, దేహదారు ఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. మంచి ఆరోగ్యం, తెలివితేటలు, జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్. వెంకటే శ్వరరావు మాట్లాడుతూ క్రీడాకారులందరికీ సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యశాఖాధికారి డా.ఎస్.డి.వి రమణ, ఆర్చరీ సెక్రటరీ డి.గాంధీ, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆంధ్ర రాష్ట్రానికి ఇదేమి కర్మ.. నిమ్మక జయకృష్ణ.

విశాలాంధ్ర-సీతంపేట: మండలం సామరెల్లి గ్రామపంచాయతీలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పాలకొండ నియోజకవర్గం ఇన్‌చార్జ్ నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు వైసీపీ ప్రభుత్వంలో అనేక సమస్యలుతో సతమతమవుతున్నారని నిత్యవసర సరుకులకు అధిక ధరలు పెంపుదల, రాష్ట్రంలో ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు వలసలు పేద ప్రజలు వెళ్లిపోతున్నారని అన్నారు. డీజిల్ పెట్రోల్ ధరలు పెంపుదలతో సామాన్యులు వాహనాలు నడపలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇసుక కొరతతో పేద ప్రజలు ఎవరు ఇల్లు నిర్మించు కోలేకపోతున్నారన్నారు. రాష్ట్రంలో సామాన్యులు పన్నులు ఇంటి పన్ను, నీటి పన్ను, చెత్తపన్ను బాదుడితో ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వైసిపి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు ఓట్లతో బుద్ధి చెప్పి గద్దెదించుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బి చంద్రరావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు సవర తోట ముఖలింగం, సర్పంచ్ బిడ్డికప్పారావు, ప్రకాశం, ఆరిక సువర్ణ, స్వామి నాయుడు, సుబ్బారావు, భాస్కర్ రావు, చంద్రరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీల్లో వంగర విద్యార్థులకు కలెక్టర్ చెక్కులు అందజేత

విశాలాంధ్ర-వంగర : వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఇరువురి కి జిల్లా కలెక్టర్ ఏ.సూర్యకుమారి, జాయింట్ కలెక్టర్ లు సోమవారం విజయనగరం కలెక్టరేట్ లోచెక్కుల నుఅందజేశారు.జిల్లా స్థాయి డ్రాయింగ్ పోటీల్లో రెండవ స్థానం లో నిలిచిన తొమ్మిదవ తరగతి చదువు తున్న యామినికి జిల్లా కలెక్టర్ సూర్య కుమారి 5000 రూపాయల చెక్కు ను,మూడవ స్థానంలో నిలిచిన ఎస్.పావనికి 3000 రూపాయల చెక్కులు ను అందజేసిన కలెక్టర్ సూర్యకుమారి విద్యార్థులను అభినందించారు.ఈ వంగర హై స్కూల్ విద్యార్థులు అన్ని పోటీల్లో రాష్ట్ర,జిల్లా,డివిజెన్ స్థాయిలో ఎంపికపై మండల,జిల్లాకే. పేరు, ప్రఖ్యాతులు తెచ్చి పెట్టటానికి కారణం ఆయన వంగర హెడ్ మాస్టర్ ఎం.రమణమ్మ ను, గైడ్ టీచర్ రాముడు ఉపాధ్యాయుడును మండలంలో పలు పాఠశాలలు ఉపాధ్యాయులు, పలు పార్టీల నాయకులు,అందరూ అభినందించారు.

జగన్ రెడ్డి పాలనలో అంత రక్త చరిత్రే!

మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో అంతా రక్త చరిత్రే అని మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బొబ్బిలి చిరంజీవులు అన్నారు. సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జగనాసుర రక్త చరిత్ర కర పత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుండి హత్యలు, అరాచకాలు, దోపిడీలు తదితర వాటిని ప్రోత్సహించారన్నారు. జగన్మోహన్ రెడ్డి కాలమంతా జరిగిన విషయాలపై రక్త చరిత్రర పుస్తకాన్ని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా ప్రజల్లో భయాందోళన కలిగించారన్నారు. నిత్యం కక్షలతో పాలన కొన సాగించి వాటిపై విమర్శించే వారిని లేనిపోని కేసులు పెడుతు న్నారన్నారు. దీనివలన పరిపాలన అంతా గాడి తప్పిందని అన్నారు. అభివృద్ధి జరగక ఎక్కడ వేసి గొంగలి అక్కడే ఉందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి సర్వనాశనం చేశారన్నారు. ఈ విషయాలన్నీ ప్రజలకు వివరిస్తామని తెలిపారు. మండల, పట్టణ అధ్యక్షులు డి మోహన్ రావు, జిరవికుమార్, సీతానగరం మండల అధ్యక్షులు కొల్లి తిరుపతిరావు, కౌన్సిలర్ బద్దే గౌరినాయుడు, మాజీ పట్టణ అధ్యక్షులు కోల వెంకట్రావు, అరుకు పార్లమెంటరీ ఎస్సీసెల్ అధికార ప్రతినిధి గర్భాపు ఉదయభాను, మండల ప్రధాన కార్యదర్శి బోనుదేవీ చంద్ర మౌళి, మాజీ మండలాధ్యక్షులు గొంగాడ రామ్మూర్తి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్ భాస్కరరావ్ను, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు మరిసర్ల కార్తీక్, అరకు పార్లమెంటరీ తెలుగు యువత ఉపాధ్యక్షులు జాగాన రవిశంకర్ ధనంజయ, గంగాపురం టిడిపి నాయకులు తాన్న ప్రసాద్, తాళ్లబురిడీ మాజీ సర్పంచ్ బేత లక్ష్మణరావు, టిడిపి నాయకులు బుడితి శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రక్రియ సజావుగా సాగాలి



విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో తహాశీల్దార్ డి.రాజేశ్వరరావు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సంధర్భంగా స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించియున్నారు. ఈ సంధర్భంగా తహాశీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల్లో భాగంగా అమలులో ఉన్న ఎన్నికల ప్రాదేశిక నియమావళి ప్రకారం మీ గ్రామాలలో రాజకీయ నేతల ఫొటోస్ కాని, బ్యానర్స్ కానీ, ఫ్లెక్సీ లు కాని, రాజకీయ పార్టీల జెండాలు కాని ఉన్నట్లన వెంటనే వాటిని తొలగించాలని అదేవిధంగా మీ గ్రామాల్లో అనుమానిత సంఘటనలు జరుగుతున్నట్టు భావిస్తే తమ దృష్టికి తీసుకురావాలని, మండలంలో ఎన్నిక ప్రక్రియ సజావుగా జరిగేటట్లు చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వారు హాజరు అయ్యారు.

అక్రమ మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో కూనాయవలస గ్రామపంచాయతీ, మధుర గ్రామం జన్నవలస గ్రామానికి చెందిన గెంబలి కృష్ణ అనే వ్యక్తి సోమవారం తెర్లాం జంక్షన్లో 20 అక్రమ మద్యం బాటిల్లో తీసుకువెళ్తుండగా స్థానిక ఎస్సై ఆర్.రమేష్ పట్టుకున్నారు. ఈయనను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

ముఖ ఆదారిత హాజరునుండి విముక్తి కలిగించండి

కలెక్టరేట్ వద్ద ధర్నాకు వీఆర్ఏల వినతి

వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు గట్టు వెంకన్న

విశాలాంధ్ర-వేపాడ: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ముఖ ఆధారిత హాజరునుండి వీఆర్ఏలకు ముక్తి కలిగించాలని వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు గట్టు వెంకన్న కోరారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుల పిలుపుమేరకు నేడు రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ ల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు ధర్నాకు వెళ్లేందుకు సోమవారం తహసీల్దార్ కు వినతి పత్రం అందజేసి అనుమతి కోరారు. అదేవిధంగా వీఆర్ఏల కనీస వేతనం 26చేసి పే స్కేలు అమలు చేయాలన్నారు. అర్హత కలిగిన వీఆర్ఏలకు వీఆర్వోలుగా, అటెండర్ల గా ప్రమోసన్లు కల్పించాలన్నారు. అలాగే రికవరీ చేసిన డి.ఎ ను తిరిగి చెల్లించి, నామినీలుగా పనిచేస్తున్న వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు పొట్నూరు మహేష్, అశోక్,తదితరులు, పాల్గొన్నారు.

మహిళ లేనిదే సమాజం లేదు : జేఎన్టీయూ వీసీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం గురజాడలో సోమవారం విమెన్ ఎంపవర్మెంట్ అండ్ గ్రీవెన్స్ సెల్, డైరెక్టరేట్ ఆఫ్ ఎంపవర్మెంట్ ఆఫ్ వుమెన్ అండ్ గ్రీవెన్స్‌సెల్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా జేఎన్టియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె వెంకట సుబ్బయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా జ్యోతి ప్రభంజనం చేసి జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియ జేశారు. నైటింగేల్ ఆఫ్ ఇండియా సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకొని జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. మహిళ లేనిదే సమాజం లేదని ప్రతి మహిళకు సెల్యూట్ చేయాల న్నారు ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు అన్నిరంగాలలో రాణించడం అభినంద నీయమన్నారు. మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగలరని, పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దే అవకాశం ఎక్కువగా మహిళలకే ఉంటుందన్నారు. మహిళలకు ఉన్న చట్టాలను అందరూ అవగాహన పెంచుకోవాలన్నారు సైబర్ మోసాలపట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్టర్ జి స్వామి నాయుడు మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ అనేది చాలా అడ్వాన్స్ టెక్నాలజీ అని, ఈ రంగం లో నిపుణులకు మంచి ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. కార్యక్రమంలో జి జయసుమ, డి రాజ్యలక్ష్మి,జి మాధవి, వి వల్లి కుమారి సర్కిల్ ఎస్సై లక్ష్మణరావు, ఎస్సై కే టి ఆర్ లక్ష్మి పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్లో మిగులు సిమెంటును సర్దుబాటు చేయండి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ సూర్యకుమారి

విశాలాంధ్ర-విజయనగరం : మనబడి నాడు-నేడు పథకంలో భాగంగా జిల్లాలోని విద్యా సంస్థల్లో చేపట్టిన పనులకు సంబంధించి మిగులు సిమెంటును అవసరం ఉన్నచోట సర్దుబాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. రెండో దశలో భాగంగా కేటాయించిన సిమెంటును కొన్నిచోట్ల పూర్తిగా వినియోగించలేదని, సంబంధిత నిల్వలను అవసరం ఉన్న ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని సూచించారు. జిల్లాలో చేపట్టిన నాడు-నేడు పనుల ప్రగతిపై కలెక్టరేట్ ఆడిటోరియంలో సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. పనుల నిమిత్తం కేటాయించిన సిమెంటును వినియోగించి సకాలంలో పనులు పూర్తి చేయాలని, ఒకవేళ సిమెంటు మిగిలినట్లయితే సంబంధిత నివేదికను మంగళవారం సాయంత్రానికి తెలియజేసి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సిమెంటు కేటాయించినప్పటికీ పనులు ప్రారంభం కాకపోతే సంబంధిత ఇండెంటును ఇతర ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. మొదటి ప్రాధాన్యతగా పాఠశాలలకు, రెండో ప్రాధాన్యతలో భాగంగా కళాశాలలకు మిగులు సిమెంటును సర్దుబాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

అలాగేమధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా అందిస్తున్న ఆహారాన్ని మరింత రుచికరంగా వండాలని, ఎక్కువ మంది పిల్లలు ఆహారాన్ని తీసుకొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. పిల్లలు సరిగ్గా తినకపోవటం వల్ల రక్తహీనత, ఇతర సమస్యలు ఉత్పన్నమవుతాయని అన్నారు. భోజన విరామ సమయం లో పిల్లలను బయటకి పంపించ వద్దని కలెక్టర్ సూచించారు. బయట చిల్లర తిండి తినటం వల్ల పిల్లలు మధ్యాహ్న భోజనం తినడానికి ఆసక్తి కనబరచటం లేదని, దీన్ని దృష్టిలో పెట్టుకొని పిల్లలను మధ్యాహ్నం పూట బయటకు పంపింపచకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఒక వేళ ఎవరైనా ఇంటి నుంచి బాక్సు తెచ్చుకుంటే అనుమతించాలని స్పష్టం చేశారు.సమావేశంలో డీఈవో లింగేశ్వర రెడ్డి, డీవీఈవో సురేశ్, స్పెషల్ ఆఫీసర్లు, హెచ్.ఎం.లు తదితరులు పాల్గొన్నారు.